ఎంవీఏలో ముసలం?

సీఎం పీఠం కాంగ్రెస్‌కే.. పృథ్వీరాజ్ ప్రకటన

ముంబై నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికలు సమీపించిన వేళ మహా వికాస్ అఘాడి (ఎంవీఏ)లో ముసలం మొదలైంది. ఈ ఎన్నికల్లో గెలిస్తే కాంగ్రెస్ అభ్యర్థే సీఎం అవుతారని మాజీ సీఎం, కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్ పేర్కొన్నారు. తనను ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత ఒకరు సంప్రదించి బీజేపీలో చేరమని ఆఫర్ చేశారని.. అయితే అందుకు నిరాకరించి తాను కాంగ్రెస్‌లోనే ఉంటానని.. తన పార్టీ అభ్యర్థి సీఎం అవుతారని చెప్పినట్లు వెల్లడించారు. అంతే గాక బీజేపీపై కూడా ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వ్యాఖ్యలతో కూటమిలో చీలిక వచ్చిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో అన్ని పార్టీలు తమ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేస్తున్నాయి. ఎన్నికల తర్వాత సీఎంను ప్రకటిస్తామని మహాయుతి కూటమి చెబుతుండగా.. ముఖ్యమంత్రి పదవి విషయంలో ఎంవీఏలో చీలిక వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఎన్నికల ప్రకటనకు ముందు చాలాసార్లు ఉద్ధవ్ ఠాక్రే సీఎం అభ్యర్థిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అయితే ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, కాంగ్రెస్ పార్టీ నిరాకరించి ఉద్ధవ్‌కు షాక్ ఇచ్చాయి.

ఆమె రీల్స్ చేస్తూ ఉంటే మతాన్ని ఎలా కాపాడగలం?

ఫడ్నవీస్ భార్యపై కన్హయ్య వ్యాఖ్య

ముంబై, నవంబర్ 14: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ భార్య అమృతను ఉద్దేశించి కాంగ్రెస్ నాయకుడు కన్హయ్య కుమార్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. బుధవారం నాగ్‌పూర్‌లో జరిగిన మహారాష్ట్ర ఎన్నికల ప్రచార ర్యాలీలో కన్హయ్య ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికలను రాష్ట్రంలో ఓట్ జిహాద్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ధర్మ యుద్ధంగా పోలుస్తూ ఇటీవల దేవేంద్ర ఫడ్నవీస్ చేసిన వ్యాఖ్యలకు కన్హయ్య కౌంటర్ ఇచ్చారు. 'మతాన్ని కాపాడే బాధ్యత మనది.. వారి పిల్లలు మాత్రం ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాల్లో చదువుతారు. డిప్యూటీ సీఎం భార్య ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేయడం సరికాదు. మతాన్ని కాపాడుకోవాలంటే అందరం కలిసి కాపాడుకుందాం.' అంటూ కన్హయ్య వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. 'మహారాష్ట్ర ఆడబిడ్డను అవమానించేందుకు మీకెంత ధైర్యం? ఈ వ్యాఖ్యలు ప్రతీ మరాఠీ మహిళకు అవమానం' అంటూ బీజేపీ అధికార ప్రతినిధి షెహ్‌జాద్ పూనావాలా 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఢిల్లీ మేయర్ ఎన్నికల్లో బీజేపీకి షాక్

ఆప్ అభ్యర్థి జయభేరి

న్యూఢిల్లీ: గురువారం హోరాహోరీగా జరిగిన ఢిల్లీ నగర మేయర్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ బీజేపీపై విజయం సాధించింది. 256 ఓట్లలో 133 ఓట్లు ఆప్ అభ్యర్థి మహేశ్ ఖిచికి లభించగా, ఆయన ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి కిషన్‌లాల్‌కు 130 ఓట్లు లభించాయి. రెండు ఓట్లు చెల్లనివిగా ప్రకటించారు. మేయర్ ఎన్నికల్లో ఓటమితో డిప్యూటీ మేయర్ ఎన్నికల నుంచి బీజేపీ వైదొలగింది. ఫలితంగా, డిప్యూటీ మేయర్ పదవిని ఆప్ అభ్యర్థి రవీందర్ భరద్వాజ్ సొంతం చేసుకున్నారు. ఢిల్లీ శాసన సభ ఎన్నికలు వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న తరుణంలో ఈ విజయాలు గొప్ప సంతోషాన్ని ఇచ్చాయని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలు చెప్పారు. దళితుడు మేయర్ కావడంతో ఆప్ కౌన్సిలర్లు జై భీమ్ అని నినాదాలు చేశారు. ఈ ఎన్నికల్లో తమ కౌన్సిలర్లు 8 మంది క్రాస్ ఓటింగ్ చేసినట్లు ఆప్ ఆరోపించింది. వీరి ఓట్లతోనే బీజేపీ బలం పెరిగిందని పేర్కొంది. ఈ ఓటింగ్‌కు కాంగ్రెస్ కౌన్సిలర్లు (ఏడుగురు) దూరంగా ఉన్నారు.

కర్ణాటక సర్కారు మరో బాదుడు?

త్వరలో నీటి బిల్లులపై హరిత సుంకం!

బెంగళూరు, నవంబర్ 14: కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం ప్రజలపై మరో బాదుడుకు సిద్ధపడుతున్నది. పశ్చిమ కనుమ నదీ జలాలను వినియోగించే నగర వాసుల నీటి బిల్లులపై త్వరలో హరిత సుంకం(సెస్)ను విధించనుంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ హరిత సెస్‌కు సంబంధించిన ముసాయిదా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖాండ్రే.. ఆ శాఖ అదనపు చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. పశ్చిమ కనుమల పరిరక్షణకే ఈ సెస్‌ను విధించాలని యోచిస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. ఒక్కో నీటి బిల్లు నుంచి రెండు మూడు రూపాయలు వసూలు చేస్తే ప్రజలకు పశ్చిన కనుమల ప్రాధాన్యత తెలియడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుందని మంత్రి అన్నారు. ఈ నిధులను మొక్కల పెంపకం, అటవీ అంచున ఉండే వ్యవసాయ భూమిని స్వచ్ఛందంగా అమ్మే రైతుల నుంచి కొనుగోలుకు, పశ్చిమ కనుమల పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేసే జంతు కారిడార్‌కు, అడవుల, జంతువుల పరిరక్షణకు ఏర్పాటు చేసే బ్యారికేడ్ల ఏర్పాటుకు వాడతామన్నారు.

మండిపడ్డ బీజేపీ.. సెస్ నిజం కాదన్న డీకే

నీటి బిల్లులకు హరిత సెస్ విధింపు యోచనపై విపక్ష బీజేపీ మండిపడింది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక దివాలాకోరుతనానికి ఇది నిదర్శనమని, ఇదంతా ఉచిత గ్యారంటీల మహిమ అని ఆ పార్టీ ఎమ్మెల్యే మహేశ్ టెంగింకై పేర్కొన్నారు. ప్రభుత్వం పశ్చిమ కనుమలను పరిరక్షించాలనుకుంటే కేంద్రాన్ని నిధులు అడగాలి తప్ప, ఇలా ప్రజలపై భారం వేయడం తగదని అన్నారు. అయితే హరిత సెస్ విధింపు ఎంతమాత్రం నిజం కాదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఇది కేవలం బీజేపీ చేస్తున్న ప్రచారమేనని, నీటి పన్నుపై తాము ఎలాంటి అదనపు సెస్ విధించడం లేదని తెలిపారు.

చేతనైతే పదవి నుండి దించండి

బెంగళూరు: చేతనైతే తనను పదవి నుంచి తప్పించడానికి ప్రయత్నించాలని విపక్ష బీజేపీకి కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సవాల్ విసిరారు. మైసూరులో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపర్చడానికి బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని, అలాంటి కుటిల ప్రయత్నాలను ఇంకా కొనసాగిస్తే ప్రజలు ప్రశాంతంగా చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాల సీఎంలు, విపక్ష నేతలపై కూడా బీజేపీ ఇలాంటి ప్రయత్నాలే చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ముడా భూమి కుంభకోణానికి సంబంధించి తనపై మోపిన ఆరోపణలన్నీ అబద్ధాలేనని సిద్ధరామయ్య స్పష్టం చేశారు.

50 కోట్లు లంచమిచ్చినట్టు నిరూపించాలి: బీజేపీ

కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ఒక్కో ఎమ్మెల్యేలకు బీజేపీ రూ.50 కోట్లు లంచమిచ్చినట్టు చేసిన వ్యాఖ్యల మూలాలను వెల్లడించాలని, తన ఆరోపణలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిరూపించుకోవాలని కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర సవాల్ విసిరారు. ముఖ్యమంత్రికి తన సొంత ఎమ్మెల్యేలపైనే నమ్మకం లేదని, అందుకనే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి తన ఆరోపణలను నిరూపించకుంటే ఇకపై ఆయన మాటలను ప్రజలు విశ్వసించబోరని విమర్శించారు. అయితే విజయేంద్ర సవాల్‌పై స్పందించేందుకు సిద్ధరామయ్య నిరాకరించారు. ఇటీవలే రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి చేసిన వ్యాఖ్యలపై స్పందించాలని ఎందుకు అడుగుతున్నారని విలేకరులను ఎదురు ప్రశ్నించారు.

ఈడీ విచారణకు ముడా మాజీ చైర్మన్ హాజరు

ముడా కుంభకోణం కేసులో విచారణకు మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) మాజీ చైర్మన్ కే మరిగౌడ గురువారం ఈడీ ముందు హాజరయ్యారు. ముడా చైర్మన్‌గా ఉన్న మరిగౌడ వ్యక్తిగత కారణాలతో గత నెలలో పదవికి రాజీనామా చేశారు.

పినాక ప్రయోగ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ, నవంబర్ 14: భారత దేశ రక్షణ, పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ఆధ్వర్యంలో గైడెడ్ పినాక ఆయుధ వ్యవస్థ ప్రయోగ పరీక్షను గురువారం విజయవంతంగా నిర్వహించారు. ప్రావిజనల్ స్టాఫ్ క్వాలిటేటివ్ రిక్వయిర్‌మెంట్స్ (పీఎస్‌క్యూఆర్) ధ్రువీకరణ ప్రయోగాలలో భాగంగా దీనిని పరీక్షించినట్టు అధికారులు తెలిపారు. పినాక అనేది పూర్తి దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన బహుళ రాకెట్ లాంచర్. దీనిని భారత సైన్యం కోసం డీఆర్‌డీవో అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగ పరీక్షలు మూడు దశల్లో వేర్వేరు ఫైరింగ్ రేంజుల్లో నిర్వహిస్తారు. ఈ పరీక్షలో భాగంగా పీఎస్‌క్యూఆర్ పారామితులైన రేంజింగ్, కచ్చితత్వం, స్థిరత్వం తదితర అంశాలను విస్తృతమైన పరీక్ష ద్వారా అంచనా వేస్తారు. రెండు ఇన్ సర్వీస్ పినాక లాంచర్‌ల ద్వారా ఒక్కో ప్రొడక్షన్ ఏజెన్సీ నుంచి 12 రాకెట్లను పరీక్షించారు.

శబరిమల యాత్రికుల కోసం వాతావరణ సమాచారం

న్యూఢిల్లీ: భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మొట్టమొదటిసారిగా శబరిమల యాత్రికుల కోసం స్థానిక వాతావరణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నది. అమర్‌నాథ్, చార్‌ధామ్‌లలో మాదిరి 'శబరిమల' యాత్రపై వాతావరణ వ్యవస్థను తీసుకొస్తున్నట్టు ఐఎండీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సన్నిధానం, పంబా, నీళక్కల్.. మూడు చోట్ల వర్ష సూచికలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపింది. దీంతో శబరిమలకు సంబంధించి మూడు రోజుల వాతావరణ సమాచారం భక్తులకు అందుబాటులోకి రానున్నది. ఈ నేపథ్యంలో అయ్యప్ప భక్తుల శబరిమల యాత్ర మరింత సులభతరం అవుతుందని ఐఎండీ పేర్కొన్నది. శాశ్వత వాతావరణ పర్యవేక్షణ వ్యవస్థను తీసుకొస్తున్నట్టు తెలిసింది.

ఢిల్లీని కమ్మేసిన కాలుష్యం

300 విమానాల రాకపోకలు ఆలస్యం

ప్రాథమిక బడుల మూత.. వాహనాలపై ఆంక్షలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యం కమ్మేసింది. గురువారం నగరమంతా దట్టమైన పొగ అలుముకుంది. దీంతో వాహనాలు, విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చాలా మంది ఇండ్లకే పరిమితమయ్యారు. పరిశుభ్రమైన గాలిని పీల్చుకునేందుకు గల ప్రాథమిక హక్కు ప్రశ్నార్థకమైంది. న్యూఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే విమానాలపైనా దీని ప్రభావం పడింది. 300కుపైగా విమానాల రాకపోకల్లో జాప్యం జరిగింది. ఇక్కడి నుంచి బయల్దేరాల్సిన 88 శాతం విమానాలు, ల్యాండ్ అవ్వాల్సిన 54 శాతం విమానాలు ఆలస్యమయ్యాయి.

కాలుష్యాన్ని తగ్గించేందుకు ఆంక్షలు

ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) వరుసగా రెండో రోజు గురువారం 'తీవ్రమైన' విభాగంలో 430గా నమోదైంది. దీంతో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్(గ్రాప్) మూడో దశ కింద కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ పలు ఆంక్షలు విధించింది. హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ నుంచి నగరంలోకి విద్యుత్తు, సీఎన్‌జీ, బీఎస్-4 డీజిల్ బస్సులు మినహా మిగతా అంతర్రాష్ట్ర బస్సుల ప్రవేశాన్ని నిషేధించింది. నగరంలో నిర్మాణ, కూల్చివేతలు, మైనింగ్ పనులను ఆపేయాలని ఆదేశించింది. ప్రధాన రోడ్లపై నీళ్లు చల్లాలని సూచించింది. ఐదో తరగతి లోపు విద్యార్థులకు పాఠశాలలు నిర్వహించొద్దని, ఆన్‌లైన్ తరగతులు జరపాలని ఆదేశించినట్టు సీఎం ఆతిశీ ప్రకటించారు.

ముంబై ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

ముంబై, నవంబర్ 14: ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు రావడం అలజడి సృష్టించింది. గురువారం గుర్తు తెలియని వ్యక్తి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడు. ముంబై నుంచి అజర్‌బైజాన్‌కు వెళ్తున్న విమానంలో మహమ్మద్ అనే వ్యక్తి బాంబులను తీసుకెళ్తున్నాడని హెచ్చరించాడు. దీంతో సీఐఎస్ఎఫ్, స్థానిక పోలీసులు ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించగా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. (ఎన్ఐఏ) సైబర్ విభాగం విచారణను ప్రారంభించింది.

అమెరికా తదుపరి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా తులసి గబ్బర్డ్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన డొనాల్డ్ ట్రంప్ మాజీ డెమొక్రటిక్ రిప్రజెంటేటివ్ తులసి గబ్బర్డ్‌ను అత్యంత కీలక పదవికి ఎంపిక చేశారు. దేశ ఇంటెలిజెన్స్ కమ్యూనిటీ నాయకత్వంలో భారీ మార్పులకు శ్రీకారం చుడుతూ ఆమెను డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ (డీఎన్ఐ) పదవికి ఎంపిక చేశారు. ఈ పదవీ బాధ్యతల్లో భాగంగా ఆమె సీఐఏ, ఎన్ఎస్ఏ సహా 18 ఇంటెలిజెన్స్ ఏజెన్సీలను పర్యవేక్షించనున్నారు. తనను ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌గా నియమించినందుకు ట్రంప్‌నకు తులసి ధన్యవాదాలు చెప్పారు. తులసి గబ్బర్డ్ డెమొక్రటిక్ పార్టీ తరపున దేశాధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తారనే వార్తలు గతంలో వచ్చాయి. అయితే ఆమె 2022లో ఆ పార్టీని వదిలిపెట్టి, ట్రంప్‌నకు మద్దతు పలికారు.

నటి కస్తూరి ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ

మధురై: నటి, టీవీ ప్రెజెంటర్ కస్తూరి శంకర్‌కు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు మద్రాస్ హైకోర్టు మధురై ధర్మాసనం గురువారం తిరస్కరించింది. తమిళనాడులోని తెలుగు మాట్లాడేవారిపై ఆమె అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు దాఖలైన కేసులో అరెస్ట్ కాకుండా రక్షణ కల్పించాలని ఆమె కోరారు. జస్టిస్ ఆనంద్ వేంకటేశ్ మాట్లాడుతూ.. కస్తూరి ఇటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదన్నారు. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలం నుంచి తెలుగు వారు తమిళనాడులో ఉంటున్నారని, ఈ దేశంలో వారు కూడా భాగమేనని చెప్పారు.

మధ్యప్రదేశ్‌లో దళిత గ్రామానికి నిప్పు

ఉప ఎన్నికల అనంతరం హింస

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని విజయ్‌పూర్ శాసన సభ స్థానం ఉప ఎన్నికల పోలింగ్ తర్వాత హింస చెలరేగింది. బుధవారం పోలింగ్ ముగిసిన తర్వాత గోహ్తా గ్రామంలోని దళితుల ఇండ్లకు దుండగులు నిప్పు పెట్టారు. రాళ్లు విసిరి, వాహనాలు, ఆస్తులను ధ్వంసం చేశారు. దీంతో భయకంపితులైన గ్రామస్థులు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఆశ్రయం పొందారు. ఎన్నికల ముందే హింస ప్రారంభమైందని.. కొందరు జరిపిన కాల్పుల్లో ముగ్గురు గ్రామస్థులు గాయపడ్డారని స్థానికులు తెలిపారు.

విద్యార్థుల ఆందోళనతో ఒకే షిఫ్టులో పీసీఎస్ పరీక్ష

యూపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్ణయం

ప్రయాగ్‌రాజ్: ఉత్తర్‌ప్రదేశ్‌లో విద్యార్థులు తీవ్ర ఆందోళన చేస్తున్న క్రమంలో కీలక పరీక్షను ఒకే రోజు ఒకే షిఫ్టులో నిర్వహించాలని ఆ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్ణయించింది. దీని ప్రకారం ప్రొవెన్షియల్ సివిల్ సర్వీస్ (పీసీఎస్) ప్రిలిమ్స్ పరీక్ష ఒకే రోజు జరగనుండగా, రిక్రూట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రివ్యూ ఆఫీసర్ల రిక్రూట్ పరీక్షలను ఒకే షిఫ్టులో నిర్వహణకు గల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయడానికి ఒక కమిటీని వేయాలని నిర్ణయించింది. అయితే ఈ నిర్ణయంపై విద్యార్థులు సంతృప్తి చెందలేదు. నోటిమాటతో హామీ ఇస్తే సరిపోదని, నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'లాటరీ కింగ్'పై ఈడీ దాడులు

చెన్నై: 'లాటరీ కింగ్'గా పేరొందిన చెన్నైకి చెందిన లాటరీ, గేమింగ్ వ్యాపారి శాంటియాగో మార్టిన్ ఆస్తులపై ఈడీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. మార్టిన్‌తో పాటు ఆయన అల్లుడు ఆధవ్ అర్జున్, అనుచరుల ఇండ్లు, కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. చెన్నై, కోయంబత్తూర్, ఫరీదాబాద్, లుధియానా, కోల్‌కతాలో ఏకకాలంలో దాదాపు 20 చోట్ల దాడులు జరిగాయి.

షిఫాలీకి మిసెస్ యూనివర్స్ అమెరికా కిరీటం

వాషింగ్టన్: భారత సంతతికి చెందిన షిఫాలీ జమ్వాల్ మిసెస్ యూనివర్స్ అమెరికా 2024 కిరీటాన్ని దక్కించుకున్నారు. రెంటన్‌లో ఏంపవరింగ్.ఓఆర్‌జీ నిర్వహించిన పోటీలో ఆమె మిసెస్ యూనివర్స్ అమెరికాగా ఎంపిక య్యారు. దీంతో ఆమె వచ్చే ఏడాది జరిగే మిసెస్ యూనివర్స్ పోటీలకు అమెరికా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. జమ్ముకు చెందిన రిటైర్డ్ ఆర్మీ అధికారి కుమార్తె అయిన జమ్వాల్ సీటెల్‌లో ఉంటూ ఎస్పెర్.ఈవోలో సీనియర్ ప్రొడక్ట్ మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. లైవ్2 ఎన్జీవోకు సహ వ్యవస్థాపకురాలు.

సైబర్ నేరాల్లో కొత్త స్కామ్ 'విషింగ్'

రికార్డెడ్ కాల్స్‌తో మోసానికి యత్నం

న్యూఢిల్లీ: ప్రజల ఆన్‌లైన్ భద్రతకు ముప్పు తెచ్చే సైబర్ నేరాలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా విషింగ్ లేదా వాయిస్ ఫిషింగ్ గురించి ఆందోళన వ్యక్తమవుతున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ స్కామ్‌లో ఇంటర్నేషనల్ నంబర్ల నుంచి ఆటోమేటెడ్ వాయిస్ మెసేజ్ వస్తున్నది. సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్ నుంచి ముఖ్యమైన గమనిక అని హెచ్చరిస్తున్నది. ''మీ వ్యక్తిగత వివరాలను డార్క్ వెబ్‌లో నిరంతరం వాడుతున్నారు. మీరు రెండు గంటల్లోగా రిపోర్ట్ చేయకపోతే, మీ మీద చట్టపరమైన చర్య తీసుకుంటాం'' అన్నది ఆ హెచ్చరిక సారాంశం. రిపోర్ట్ చేయడం కోసం నంబర్ 9ను నొక్కాలని కోరుతున్నది. ఎవరైనా మోసపోయి నంబర్ 9 నొక్కితే కాల్ స్కామ్ ఆర్టిస్ట్‌కు కనెక్ట్ అవుతుంది. ఆ స్కామ్ ఆర్టిస్ట్ స్పందించి, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు వంటి ముఖ్యమైన సమాచారాన్ని తెలియజేయాలని లేదా డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెస్తాడు. ఇదంతా సమస్యను పరిష్కరించడం కోసమే అడుగుతున్నట్లుగా నటిస్తాడు.

ఎలా తప్పించుకోవాలి?

అవాంఛనీయ ఫోన్ కాల్స్‌కు స్పందించకూడదు. ప్రభుత్వ శాఖలు సున్నితమైన సమాచారాన్ని ముందుగా రికార్డు చేసిన సందేశాల ద్వారా అడగవు. కాబట్టి ఆ ఫోన్ ఎక్కడి నుంచి వచ్చిందో ధ్రువీకరించుకోవాలి. ఇంటర్నేషనల్ నంబర్లు, లోకల్ నంబర్ల నుంచి వచ్చే అనుమానాస్పద కాల్స్‌పై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

ఇస్లామిక్ దేశం దిశగా బంగ్లాదేశ్?

రాజ్యాంగంలో సెక్యులర్ పదం తొలగింపునకు ప్రయత్నాలు

బంగ్లాదేశ్, నవంబర్ 14: బంగ్లాదేశ్ ఇస్లామిక్ దేశం దిశగా అడుగులు వేస్తున్నది. ఆ దేశ రాజ్యాంగం నుంచి 'సెక్యులర్' పదం తొలగింపునకు ప్రయత్నం జరుగుతున్నది. ఈ మేరకు ఆ దేశ అటార్నీ జనరల్ మహమ్మద్ అసదుజ్జామన్ సుప్రీంకోర్టులో ఇటీవల వాదనలు వినిపించారు. దేశంలో 90 శాతం మంది ముస్లింలు ఉన్న నేపథ్యంలో సెక్యులర్ అనే పదానికి అర్థం లేదని అన్నారు. 15వ రాజ్యాంగ సవరణపై దాఖలైన పిటిషన్‌పై వాదనల సందర్భంగా ద్విసభ్య ధర్మాసనం ముందు ఈ మేరకు అభిప్రాయం వ్యక్తంచేశారు. ఆ దేశ తొలి ప్రధాని షేక్ ముజిబుర్ రెహ్మాన్‌ను జాతిపితగా పిలవడం పట్ల కూడా అభ్యంతరం తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన కృషిని కాదనలేమని, కానీ జాతిపితగా కీర్తించడం విషయంలో భిన్న వాదనలు ఉన్నాయన్నారు. ప్రజాస్వామిక విలువలను ప్రతిబింబించేలా రాజ్యాంగం ఉండాలని కోరారు.

కార్బన్ డయాక్సైడ్ ఇంధనంగా మార్పు

కొత్త పరికరం అభివృద్ధి

న్యూయార్క్, నవంబర్ 14: భూతాపానికి కారణమయ్యే గ్రీన్‌హౌజ్ ఉద్గారాలను తగ్గించే ప్రయత్నాలకు ఊతమిచ్చే కొత్త పరికరాన్ని అమెరికాలోని మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) ఇంజినీర్లు అభివృద్ధి చేశారు. ఎలక్ట్రో కెమికల్ వ్యవస్థల ద్వారా కాలుష్య కారక కార్బన్ డయాక్సైడ్‌ను ఉపయోగకరమైన ఇంధనాలు, రసాయనాలు, ప్లాస్టిక్‌గా మార్చేందుకు ప్రపంచవ్యాప్తంగా పలు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే, ఆర్థిక కోణంలో ఇవి ఆచరణాత్మక ఫలితాలు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో ఈ ఎలక్ట్రో కెమికల్ వ్యవస్థల్లో వినియోగించే ఎలక్ట్రోడ్‌ల కోసం ఎంఐటీ ఇంజినీర్ల బృందం కొత్త డిజైన్‌ను అభివృద్ధి చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు 'నేచర్ కమ్యూనికేషన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పీటీఎఫ్ఈ(టెఫ్లాన్)ను వినియోగించి ఈ ఎలక్ట్రోడ్‌ను తయారుచేసినట్టు ఎంఐటీ ఇంజినీర్లు తెలిపారు. కొత్త ఎలక్ట్రోడ్.. కార్బన్ డయాక్సైడ్‌ను ఉపయోగకరమైన ఇథిలీన్, మిథేన్, మిథనాల్, కార్బన్ మోనాక్సైడ్ వంటి రసాయనాలుగా మార్చే ప్రక్రియ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని, ఆర్థికంగా ఆచరణ సాధ్యం చేస్తుందని ఎంఐటీ ఇంజినీర్లు తెలిపారు.

రెచ్చగొట్టే ప్రసంగాలను అడ్డుకోవాలని పిటిషన్ తిరస్కరించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, నవంబర్ 14: రాజకీయ నేతలు చేస్తున్న రెచ్చగొట్టే ప్రసంగాలను అడ్డుకోవాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని మంగళవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేమని సీజేఐ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొన్నది. విద్వేష ప్రసంగాలకు, తప్పుడు వాదనలకు మధ్య తేడా ఉందని ధర్మాసనం పేర్కొన్నది. దేశ సార్వభౌమత్వానికి, శాంతి భద్రతలకు వ్యతిరేకంగా కొంతమంది రాజకీయ నేతలు చేస్తున్న రెచ్చగొట్టే ప్రసంగాల్ని అడ్డుకోవటంపై మార్గదర్శకాలు రూపొందించేలా కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని 'హిందూ సేనా సమితి' ఈ పిల్‌ను దాఖలు చేసింది. సామాన్య పౌరులు, జర్నలిస్టుల పట్ల ఒకలా, రాజకీయ నేతల పట్ల ఒకలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, ఎంతో మంది రాజకీయ నేతలు తమ మాటలతో విద్వేషాల్ని రెచ్చగొట్టినా ప్రభుత్వాలు చట్టపరమైన చర్యలు తీసుకోవటం లేదని 'పిల్'లో పేర్కొన్నది.

ల్యాబ్ వైరస్‌తో స్టేజ్-3 క్యాన్సర్‌కు చికిత్స

అనైతికమన్న వైద్య నిపుణులు

జగ్రెబ్: క్యాన్సర్ వ్యాధిపై కొంత మంది సైంటిస్టులు రోగులను స్వీయ పరిశోధన వైపు మరలించటం సంచలనం రేపుతున్నది. క్రొయేషియాలో స్టేజ్-3 స్థాయిలో ఉన్న రొమ్ము క్యాన్సర్‌ను నయం చేసేందుకు అనుసరించిన పద్ధతులపై వైద్య లోకం అభ్యంతరం వ్యక్తం చేసింది. ల్యాబ్‌లో పెరిగిన వైరస్‌తో రొమ్ము క్యాన్సర్‌ను నయం చేయటాన్ని వైద్య నిపుణులు తప్పుబట్టారు. ఇది అనైతికమంటూ వారు ఆందోళన వ్యక్తం చేశారు. క్రొయేషియాకు చెందిన 49 ఏండ్ల బీటా హాలస్సీ రొమ్ము క్యాన్సర్ బారినపడగా, ఆమె ఎడమ రొమ్మును వైద్యులు తొలగించారు. రెండోసారి అదే స్థానంలో క్యాన్సర్ కణతులు ఏర్పడటంతో 'ఆంకోలిక్టిక్ వైరోథెరపీ'గా పిలిచే 'ఓవీటీ' చికిత్సను తనకు తానుగా హాలస్సీ ఎంచుకుంది. దీని ద్వారా ఆమె క్యాన్సర్ నుంచి కోలుకుందని ఓ జర్నల్ కథనం వెలువరించింది. అయితే ఈ విధానం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇస్రోకు ఆర్థిక మద్దతు అంతంతే!

ఆ